క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె: పట్టణంలో పలు అభివృద్ధి పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ డిప్యూటీ ఈఈ డి.శ్యామ్ సుధాకర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న కాలనీ, ఇసుకపల్లి, నిజాంపట్నం రోడ్డు, గరువురోడ్డు, జేఎల్‌బీ కళాశాల రోడ్డు, రూరల్ పరిధిలోని గుడ్డికాయ లంక, బేతపూడి, ఉయ్యూరువారిపాలెం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉల్లిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో...

నగరం: మండలంలోని ఉల్లిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని మంత్రిపాలెం పరిసర గ్రామాలలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నాగుల్‌మీరా తెలిపారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



రేపల్లె: సాయిబాబా సమాధి కార్యక్రమాన్ని పట్టణంలోని పలుసాయినాధుని ఆలయాల్లో గురువారం నిర్వహించారు. అంబేడ్కర్ పార్కు సమీపంలోని సాయిబాబా ఆలయంలో బాబా సమాధిని పూలతో ఏర్పాటు చేశారు. ఆయా ఆలయాల్లో సాయి చాలీసా పారాయణం, సాయినామం జపంతో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

నేడు ఎలుకల నిర్మూలనపై అవగాహన

రేపల్లె: మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాలలో ఈనెల 4వ తేదీన సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించటం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి అవ్వారు మహేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగుభూమిలో ఎలుకలను నిర్మూలించటంపై రైతులకు అవగాహన కల్పించటంతో పాటు ఎలుకల నివారణ మందును పంపిణీ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు తమ రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



చుండూరు(వేమూరు): చుండూరు మండలం వలివేరు గ్రామంలో శ్రీ లలితా సమేత స్వయం భువేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రుల్లో భాగంగా గురువారం చండీయాగం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు యాగంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



అమర్తలూరు(వేమూరు): కరేటి వారి శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానం ఆధ్వర్యంలో 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. అమర్తలూరు మండలంలోని యడవూరు గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. అధిక మార్కులు సాధించిన ముప్వ మోహన సాహిత, బొంతా కల్పన, మరకా యశస్విని విద్యార్థులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

7న స్కూల్ గేమ్స్ సెలక్షన్లు

ప్రత్తిపాడు: ఈ నెల 7వ తేదీన మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 సెలక్షన్లు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ మండల కో ఆర్డినేటర్ షేక్ కరీముల్లా తెలిపారు. ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగ, అథ్లెటిక్స్ సెలక్షన్లు జరగనున్నాయని చెప్పారు. మండల స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీల్లో ఆడనున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు వారి జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌లను తీసుకుని ఉదయం తొమ్మిది గంటలకు క్రీడా ప్రాంగణానికి హాజరుకావాలని కరీముల్లా కోరారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు

- కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు
- భక్తి శ్రద్ధలతో అమ్మవారి విగ్రహాల ఊరేగింపు

చెరుకుపల్లి: ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభించిన శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చెరుకుపల్లి శ్రీ బాలకోటేశ్వరస్వామి, ఆర్యవైశ్య యువజన సంఘం, గుళ్ళపల్లి ఆనందీశ్వర స్వామి, పొన్నపల్లి సోమేశ్వరస్వామి, కావూరు రామలింగేశ్వర స్వామి, కనగాల పద్మశాలి యూత్ తో పాటు పొన్నపల్లి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంతో పాటు పలు గ్రామంలోని ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి వేదికల వద్ద ముగింపు సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. పలు ఆలయాల వద్ద దంపతులు శమీ పూజ కార్యక్రమం చేశారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి అన్న సంతర్పణ చేశారు,

నగరంలో...

నగరం: దసరా పర్వదిన వేడుకలను మండలంలోని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలకు విజయదశమిని పురస్కరించుకుని గురువారం శ్రీరాజరాజేశ్వరికి అలంకరణలు నిర్వహించారు. అదేవిధంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, సంత బజార్‌లో ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం వద్ద ఆలయకమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.



గుళ్లపల్లిలో శమీ పూజ

రేపల్లెలో...

రేపల్లె: విజయదశమిని పురస్కరించుకుని పట్టణంలోని పలు దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామదేవత బూరుగలమ్మ అమ్మవారికి ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో ఉదయం నుంచే సుప్రభాత సేవలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, 108 బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కన్యాక పరమేశ్వరి ఆలయంలో వాసవీ అమ్మవారు, ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో భ్రమరాంబ అమ్మవారు, రైలుపేటలోని స్వయంభూరామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా రైలుపేటలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో విశేషపూజా కార్యక్రమాలు చేశారు.



చినపరిమిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

చినపరిమిలో..

చుండూరు(వేమూరు): చుండూరు మండలం చినపరిమి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో విజయదశమి సందర్భంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం సాయంత్రం సెమీ వృక్ష ఆయుధ పూజ, గ్రామోత్సవం నిర్వహించారు.



కనగాలలో అమ్మవారి ఊరేగింపు

కర్లపాలెంలో..

కర్లపాలెం: మండలంలో దసరా దేవీ శరన్నవరాత్రుల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉత్సవాలు జరిగిన 11 రోజులు ప్రతిరోజూ వేర్వేరు అలంకరణలలో అమ్మవారి విగ్రహాలకు నూతన వస్త్రాలతో, వివిధ రకాల పూలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. వాడవాడలా జరిగిన వేడుకలలో మహిళలు, బాలికలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



బుద్ధాం గ్రామంలో పూజలందుకున్న దుర్గమ్మ



నగరంలో శ్రీరాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శమిస్తున్న అమ్మవారు



రేపల్లెలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిగా బూరుగులమ్మ



ఇసుకపల్లిలో శ్రీరాజరాజేశ్వరిగా భ్రమరాంబ

బలిజేపల్లిలో 'పొలం పిలుస్తోంది'

వేమూరు: వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వరిపొలాల్లో వివిధ రకాల పురుగులు, లక్షణాలు గుర్తించడం జరిగిందన్నారు. నేడు ప్రతి రైతు భరోసా కేంద్రంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులందరికీ ఎలుకల మందు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

రేపల్లె: పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరటనిచ్చే విధంగా పలురకాల వస్తువులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ ఎత్తివేయటంపై పలువురు చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఇసుకపల్లి చేనేత శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. చేనేత నాయకులు జీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేతలో పలువిభాగాలలో కార్మికులకు ఊరట కల్పించారని పేర్కొన్నారు. ఎంఎఫ్ నూలుపై 18 నుంచి 5శాతంకు, గృహ వస్త్రాలు, కార్పెట్లు వంటి వస్తువులపై 12 నుంచి 5 శాతంకు జీఎస్టీ తగ్గిందన్నారు. టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, చేనేత సొసైటీ మేనేజర్ కొతరపు శోభన్‌బాబు, సభ్యులు కొతరపు వెంకట నాంచారావు, చేనేత సొసైటీ సభ్యులు, జౌళి శాఖ అధికారులు ప్రశాంత్, అంజనాదేవి పాల్గొన్నారు.

వేజండ్లలో ఘనంగా ఉరుసు మహోత్సవం

వేజండ్ల(చేబ్రోలు): గ్రామంలో శుక్రవారం రాత్రి ఉరుసు మహోత్సం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్యార్మీ పండుగ సందర్భంగా ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాపు చూపిన మార్గంలో నడవాలి

- వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్
- వాడవాడలా ఘనంగా మహాత్మాగాంధీ జయంతి

చెరుకుపల్లి: జాతిపిత మహాత్మా గాంధీ చూపిన శాంతిమార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పేర్కొన్నారు. గురువారం గుళ్లపల్లి పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలు పార్టీ నాయకులతో కలసి నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగానికి కూడా వెనుకాడకుండా, గ్రామ స్వరాజ్యం కోసం పోరాడిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. గాంధీజీ మార్గంలోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ స్వరాజ్యాన్ని అందించారని, అందులో భాగంగానే ఆనాడు ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసి, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరి అవసరాను గుర్తించి మరీ వారికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. పార్టీ మండల కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, నియోజక వర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు శొంటి సురేష్, చెరుకుపల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడు తుమ్మ రామకృష్ణా రెడ్డి, దాసరి సుందరయ్య, శివ నాగేశ్వర రావు, ముక్తేశ్వరరావు, పడమటి వాసు తదితరులు పాల్గొన్నారు.



గుళ్లపల్లిలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ గణేష్



కర్లపాలెంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించిన ఎంపీడీఓ శ్రీనివాసరావు

మహాత్మాగాంధీ ఆశయాలు ఆదర్శం..

కర్లపాలెం: మహాత్మాగాంధీ ఆశయాలు ఆదర్శవతంమైనవని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీడీఓ పూలమాలవేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని గ్రామ సచివాలయాలలో స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టినవారిని అరెస్టు చేయాలి

అమృతలూరులో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రాస్తో రోకో

అమర్తలూరు(వేమూరు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన దుండగులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యూత్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమృతలూరులో శుక్రవారం రాస్తోరోకో నిర్వహించారు. గంట సేపు బస్సుల రాకపోకలు నిలిపివేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యూత్ సభ్యులు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా దేవళంపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కొందరు నిప్పు పెట్టారని, వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో దళితులు, అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. అంబేడ్కర్ విగ్రహాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసేంత వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



అమృతలూరు సెంటరులో రాస్తారోకో చేస్తున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు

స్త్రీ పాత్రలో తనకు తానే సాటి బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి

- ఆయన స్థాయికి తగిన అవార్డు రాలేదు
- వీణా అవార్డ్స్ ముగింపు సభలో ఆచార్య అప్పాజోస్యుల
- ఉప్పలపాడు సైదులుకు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి అవార్డు ప్రదానం

తెనాలి: స్త్రీ పాత్ర పోషణలో తనకు తానే సాటి అనిపించుకున్న ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి బహుముఖీనమైన ప్రజ్ఞ కలిగినవారని అజో విభో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. కళల కాణాచి, తెనాలి, ఆర్‌ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో గత ఆరురోజులుగా జరుగుతున్న వీణా అవార్డ్స్-2025 ముగింపు సభ గురువారం రాత్రి జరిగింది. నాటకరంగ విశ్లేషకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. సభలో బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని మరో ప్రముఖ నటుడు ఉప్పలపాడు సైదులుకు బహూకరించారు. విశిష్ట అతిథి ఆచార్య సత్యనారాయణ మాట్లాడుతూ స్త్రీ పాత్రలో 'స్థానం' తర్వాత అంత గొప్పగా స్త్రీ పాత్రను పోషించే సుబ్రహ్మణ్యశాస్త్రిలో స్థానంలో లేని ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ఆయన స్థాయికి తగిన అవార్డులు రాకపోవటం విచారకరమన్నారు. పద్య నాటకాలు మెరుగవుతుండటం సంతోషకరమైన అంశంగా చెప్పారు. నాటకంపై తపనతో ఒక యజ్ఞలా నిర్వహిస్తున్న వీణా అవార్డ్స్ నిర్వాహకులను అభినందించారు. ప్రముఖ సినీమాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ, యువత చేతిలోనే నాటకం భవిష్యత్ ఉందన్నారు. యువతరం నాటకాల్లోకి రావాలని, అందుకే వీణా అవార్డ్స్‌లో యువనటులకు అవకాశాల్లో వెసులుబాటు కల్పించటం, ప్రత్యేక బహుమతులను ప్రవేశపెట్టామని చెప్పారు. డాక్టర్ కందిమళ్ల మాట్లాడుతూ, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి రంగస్థలంపై నటవిశ్వరూపం అన్నారు. తాను పోషించే పాత్రల భంగిమలు, హావభావాలను ముందుగా చిత్రించుకుని, ఆ తర్వాత రంగస్థలానికి వెళ్లేవారని చెప్పారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ కళల ప్రాముఖ్యతను తెలియజెప్పారు. ఆర్‌ఎస్ఆర్ గ్రూప్స్, హైదరాబాద్ చైర్మన్ ఆర్.శ్రీకాంత్‌రెడ్డి తన ప్రసంగంలో, వీణా అవార్డ్స్‌కు తగిన ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. ప్రముఖ రంగస్థల నటులు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, బుర్రా జయలక్ష్మి అవార్డుగ్రహీత ఉప్పలపాడు సైదులు నటవిశిష్టతను తెలియజేశారు. వీజీకే అండ్ వీవీఎల్ ఫౌండేషన్ కోశాధికారి తుమ్మల కిషోర్, వాసిరెడ్డి బెన్‌బాబు ప్రభృతులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

7న విజయవాడలో ఫ్యాప్టో పోరుబాట



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

మంగళగిరి టౌన్: ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న విజయవాడలో జరిగే రాష్ట్ర ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలని జిల్లా చైర్మన్ కె. నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని కేకే మున్సిపల్ హైస్కూల్‌లో మంగళగిరి ప్రాంతీయ ఫ్యాప్టో సన్నాహన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ న్యాయంగా రావాల్సిన ఆర్థిక అవసరాలను ప్రభుత్వం ఇంతవరకు తీర్చలేదని, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. తక్షణమే ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మంగళగిరి మండల పరిధిలోని ఉపాధ్యాయులంతా ధర్నాలో పాల్గొనాలని కోరారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో డెప్యూటీ సెక్రటరీ జనరల్ రాజశేఖర్, సుబ్బారెడ్డి, ఖలీద్, ఏరియా కార్యదర్శి సాలార్ బేగ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సైదా నాయక్, మదన్ కుమార్, గోపీచంద్, జోజప్ప, అరుణ్‌కుమార్, ఏడుకొండలు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

పొన్నూరు: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, విజయ దశమి పురస్కరించుకుని పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు విశేష సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని యూనిఫాం, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, సిబ్బంది, పాల్గొన్నారు. మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

స్త్రీలు బిడ్డలను సన్మార్గంలో నడిపించాలి

పెదకాకాని: బిడ్డలను సన్మార్గంలో నడిపిస్తూ ప్రజాక్షేమం కొరకు నిరంతరం ప్రార్థించేవారిగా స్త్రీలు జీవించాలని వైటీసీఎం వ్యవస్థాపకులు ఎస్తేరు క్వీని అన్నారు. మండల పరిధిలోని నంబూరు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో గురువారం ఒకరోజు స్త్రీల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు చర్చి కాపరి బందెల రాజు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ఒక లక్ష్యం సాధించే వరకూ నిరంతరం శ్రమించాలన్నారు. ఎదుటి వారి పట్ల జాలి, దయ, క్షమా గుణం కలిగి ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన వెంకటకృష్ణాపురంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన అమ్మిశెట్టి కోటేశ్వరరావు, గుంటూరులో ట్రాక్టర్ స్పేర్‌పార్ట్స్ విక్రయించే దుకాణంలో పనిచేస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే ఈనెల ఒకటో తేదీ రాత్రి బైక్‌పై ఇంటికి బయలు దేరాడు. గుంటూరు శివారులోని ఎన్‌టీఆర్ మానససరోవరం వద్ద ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి చేరుకునే సరికి నందివెలుగు వైపు నుంచి వస్తున్న మినీవ్యాన్ ఢీ కొంది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న కోటేశ్వరరావు(35) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్యారాణి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానంద పురంలో శుక్రవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన నాయకులు ఆదినారాయణ, సాంబశివరావు, నాగేశ్వరరావు, సుభానీలతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులు రావాల్సిన బకాయిల కోసం 30 సంవత్సరాలకు పైగా ఎదురు చూస్తున్నారని, 304 రోజులుగా ఎండనక, వాననక దీక్షలు చేస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మికులు సాంబశివరావు, నాగేశ్వరరావు, ఇశ్రాయిల్, ఇమాంబి, శారమ్మ, రమాదేవి, రిబ్కా, శివకుమారి, అన్నమ్మ, గురవయ్య పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న కూరపాటి స్టీవెన్

అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మంగళగిరి టౌన్ : మంగళగిరి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు కోరారు. నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారు 22వేల మంది పేదలు వివిధ భూముల్లో ఇళ్లు వేసుకుని ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్నారని తెలిపారు. వారిలో మూడు వేల మందికి మాత్రమే మంత్రి నారా లోకేష్ ఇటీవల పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మిగిలిన 19 వేల మందికి కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు కూడా స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, దాన్ని కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీ నుంచి పట్టణంలోని అన్ని వార్డుల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలు తెలుసుకుని, వాటిని అర్జీల ద్వారా అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ఈనెల 13,14,15 తేదీల్లో రిలే దీక్షలు చేపడతామని తెలియజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై. కమలాకర్ పాల్గొన్నారు.

ఎన్జీ రంగా వర్సిటీలో గాంధీ జయంతి

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం జాతిపిత గాంధీ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద వీసీ డాక్టర్ ఆర్ శారదజయ లక్ష్మిదేవి పూల మాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ, కంప్ట్రోలర్ డాక్టర్ బీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు